లక్ష్మీనరసింహుడి క్షేత్రం.. భక్తజన సంద్రం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ క్షేత్రం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. స్కూళ్లకు వేసవి సెలవులు ముగియనుండటంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాడవీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్, ప్రసాద విక్రయశాలతోపాటు ఆలయ ప్రాంగణం కిటకిటలాడాయి. సకాలంలో ఆర్టీసీ బస్సులు లేక భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. –యాదగిరిగుట్ట

సూడాన్‌కు సిటీ మొబైల్ ఫోన్లు

- సూడాన్ దేశస్థుడితోపాటు 30 మంది అరెస్టు
- రూ.2 కోట్ల విలువైన 713 సెల్‌ఫోన్లు స్వాధీనం
- ముఠాగా స్నాచర్లు, వ్యాపారులు, టెక్నీషియన్లు
- సముద్రమార్గాన సుడాన్‌కు స్నాచింగ్ సెల్‌ఫోన్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 26 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో సెల్‌ఫోన్ స్నాచింగ్ చేసి సూడాన్ దేశానికి తరలిస్తున్న అంతర్జాతీయ సెల్‌ఫోన్ చోరీ ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. సూడాన్ దేశస్థుడితోపాటు 30 మంది హైదరాబాద్‌కు చెందిన ముఠా సభ్యులను అరెస్టుచేసి వారి నుంచి రూ.2 కోట్ల విలువైన 713 స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మీపెరుమాల్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. నగరంలో మొబైల్ ఫోన్ స్నాచింగ్‌లు, సెల్‌ఫోన్ దోపిడీ, సెల్‌ఫోన్ కోసం హత్యలు కూడా జరుగుతున్నాయి. సెల్‌ఫోన్ దోపిడీ ముఠాలపై నిఘా పెట్టి కొన్ని రోజుల క్రితం ఒక ముఠాను అరెస్టు చేశారు. తాజాగా ఇదే తరహాలో సౌత్, ఈస్ట్, సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు రంగంలోకి దిగి మరో భారీ నెట్‌వర్క్‌ను ఛేదించారు. హైదరాబాద్‌లో సెల్‌ఫోన్ స్నాచింగ్ చేసి సెల్‌ఫోన్ మరమ్మతులు చేసే దుకాణాలకు విక్రయిస్తుంటారు. అక్కడుండే టెక్నీషియన్స్ కొన్ని సెల్‌ఫోన్లను ధ్వంసం చేసి, ఆ ఫోన్ విడిభాగాలను అమ్మేస్తుంటారు, మరికొందరు సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను కూడా మార్చేసి విక్రయిస్తున్నారు. ఈ ఫోన్లను సూడాన్ దేశస్థుడు కొనుగోలు చేసి వాటిని అక్రమంగా తమ దేశానికి తరలిస్తుంటారు. అరెస్టైయిన వారిలో స్నాచింగ్ చేసే వారితోపాటు టెక్నీషియన్స్, ఆయా సెల్‌ఫోన్లను కొనుగోలు చేసి విదేశాలకు తరలిస్తున్న సూడాన్ దేశస్థుడు ఉన్నారు. తాజాగా ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో నమోదైన 27 కేసులు ఛేదించారు.

అరెస్టైయిన ముఠా సభ్యులు

ఓల్డ్‌సిటీకి చెందిన మహ్మద్ అజ్జద్, సయ్యద్ గయాజ్ హస్మీ, షేక్ అన్సర్, మహ్మద్ ముజఫర్, మహ్మద్ ఖలీద్, మహ్మద్ దస్తగిరి, మహ్మద్ హమీర్, అహ్మద్ మహమూద్ అలీ, సోహెల్ ఖాన్, మహ్మద్ ఖాన్, షేక్ మున్వార్, సయ్యద్ సాజీద్ అలియాస్ చాపల్ సాజిద్, సయ్యద్ షరీఫ్, మహ్మద్ ముస్తాఖ్, అలియాస్ సల్మాన్, సయ్యద్ సలావుద్దీన్ అలియాస్ అమ్ము అరెస్టయ్యారు. ఈ ముఠాలోని సభ్యులందరిపై గతంలోనూ కేసులున్నాయి. చోరీకి గురైన సెల్‌ఫోన్లను హైదరాబాద్‌లోని పలుచోట్ల సెల్‌ఫోన్ దుకాణదారులు తక్కువ ధరకు కొంటున్నారు. వారిలో షేక్ షాహబాజ్‌ఖాన్, మహ్మద్ ఆసిఫ్ అహ్మద్, మహ్మద్ గౌస్, మహ్మద్ అర్షద్‌మొహినుద్దీన్, మహ్మద్ నవీద్ ఉద్దీన్ సలీమ్, మహ్మద్ నజీరుద్దీన్, మహవీర్ జైన్, మహ్మద్ అబ్దుల్ సిరాజ్, మజీద్‌ఖాన్, అబ్దుల్ హజీమ్, షేక్ జావెద్ ఉన్నారు. ఐఎంఈఐ నంబర్లను ట్యాంపర్ చేసే సెల్‌ఫోన్ టెక్నీషియన్స్‌గా సయ్యద్ రహీమ్, మహ్మద్ అర్బాజ్ ఖాన్, నీజాముద్దీన్, ఖాన్ సాదిక్ అహ్మద్ ఉన్నారు. ఈ టెక్నీషియన్లు అబిడ్స్‌లోని జగదీశ్ మార్కెట్‌లో ఎక్కువగా ఉన్నారు. ఫోన్లను అన్‌లాక్ చేయడం, అంతర్జాతీయ మార్కెట్‌లో ఏమి ఉపయోగపడుతాయి, ఏమి ఉపయోగపడవు అనేది గుర్తించి వాటిని అక్కడే వేరు చేస్తుంటారు.

సూడాన్‌కు తరలింపు

చోరీ చేసి వాటిలో కొన్నింటిని ఐఎంఈఐ నంబర్‌ను ట్యాంపరింగ్ చేసి బిజినెస్ వీసాపై హైదరాబాద్‌కు వచ్చి నానల్‌నగర్‌లో నివాసముంటున్న సూడాన్ దేశానికి చెందిన మహ్మద్ ముసా హస్సాన్ గామ్రాల్నాబియకు విక్రయిస్తుంటారు. ఆయా ముఠాల నుంచి పలు దఫాలుగా సెల్‌ఫోన్లు కొంటూ తన ఇంట్లో దాచిపెట్టి వాటిని అక్రమంగా సముద్రమార్గాన సూడాన్ దేశానికి తరలిస్తాడు. అక్కడ వాటిని మార్కెట్ ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఈ ముఠా నుంచి యాపిల్ ఐఫోన్, సామ్‌సాంగ్, వివో, రెడ్‌మి, రియల్ మీ, వన్ ప్లస్, ఒప్పో, పొకొ తదితర కంపెనీల సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తును అదనపు డీసీపీ శ్రీనివాసరావు నేతృత్వంలోని ఇన్‌స్పెక్టర్లు షేక్ జకీర్ హుస్సేన్, వెంకట్‌రెడ్డి, నాగార్జున బృందాలు దర్యాప్తు చేస్తున్నాయి.

లండన్‌లో ఘనంగా శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ) : లండన్‌లోని సట్టన్ పట్టణంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో 34 ఆర్య వైశ్య కుటుంబాలు భక్తిశ్రద్ధలతో సామూహిక పూజ నిర్వహించాయి. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దక్షిణ భారతదేశంలోని ప్రముఖ దేవత. శక్తి స్వరూపిణి అయిన వాసవి అమ్మవారు శక్తి, ఆరోగ్యం, సంపదకు ప్రతిరూపంగా భక్తులు కొలుస్తారు. సాంప్రదాయ రీతిలో అలంకరించిన వేదికపై శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి గణేశ పూజ, వాసవి అభిషేకం, అఢాంగ పూజ, షోడశోపచార పూజ, అష్టోత్తర పూజ, కుంకుమ పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలకు వాసవి కథను చదివి వినిపించగా, మహిళలు వాసవి పారాయణం, చాలీసా పఠించారు. భక్తులు భజనలు, కీర్తనలు ఆలపించి, అమ్మవారి కృపను కోరారు. వేడుకల అనంతరం మహా ప్రసాద వితరణ చేశారు. ఈ వేడుకల ద్వారా పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించడానికి ఒక మంచి అవకాశం లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకల విజయవంతానికి కృషి చేసిన వీర ప్రసాద్ సూర, కృష్ణ కాకుమాని, రవి బండారు, రవి శ్రీరంగం, శ్రీకాంత్, ఇతర సభ్యులను నిర్వాహక కమిటీ అభినందించింది.

నిబంధనలు అతిక్రమించిన రియల్టర్లపై చర్యలు

- పలు రియల్ ఎస్టేట్ సంస్థలకు రెరా నోటీసులు

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): రియల్ ఎస్టేట్ నిబంధనలను ఉల్లంఘించిన పలువురు డెవలపర్లకు షోకాజ్ నోటీసులు జారీచేసినట్టు రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) వెల్లడించింది. వాటిలో ప్రజ్జ ఎకోస్పెన్ (మియాపూర్), శ్రీ సిద్ధి వినాయక ప్రాపర్టీ డెవలపర్స్ (చింతల్‌కుంట), నార్త్‌ఈస్ట్ హ్యాబిటేషన్స్ (కొండాపూర్), వీఆర్ ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ (సంగారెడ్డి జిల్లా), ఇన్వెస్ట్ ఇన్ఫ్రా ప్రాజెక్ట్ (కేపీహెచ్‌బీ కాలనీ), భారతి లేక్ వ్యూ టవర్ బిల్డర్స్ (కొంపల్లి) తదితర ప్రాజెక్టులు ఉన్నట్టు వివరించింది. రియల్ ఎస్టేట్ కంపెనీలకు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, యూడీఏ, టీజీఐఐసీ తదితర సంస్థల అనుమతులతోపాటు రెరా రిజిస్ట్రేషన్ కూడా ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. ఇండ్లు, ఫ్లాట్లను కొనుగోలు చేయాలనుకునేవారు రెరా రిజిస్టర్డ్ ప్రాజెక్టుల్లో మాత్రమే కొనుగోలు చేయాలని, ప్రీలాంచ్ ఆఫర్లను నమ్మి మోసపోరాదని సూచించారు. రెరా నిబంధనలను ఉల్లంఘించిన రియల్టర్లపై వాట్సాప్ నంబర్ 9000006301, ఫోన్ నంబర్ 040-29394972తోపాటు rera-maud@telangana.gov.in, secy-rera-maud@telangana.gov.in ఈ-మెయిల్ ఐడీలకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. రెరా నిబంధనలను అతిక్రమించినట్టు గుర్తించిన 918 ప్రాజెక్టుల నిర్వాహకులకు దాదాపు రూ.31 కోట్ల జరిమానా విధించామని, అందులో ఇప్పటివరకు రూ.13.70 కోట్లు రికవర్ చేశామని వివరించారు.

బోట్స్‌వానాలో టీకన్సల్ట్ సేవలు

హైదరాబాద్, మే 26 (నమస్తే తెలంగాణ): వరల్డ్ తెలంగాణ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (డబ్ల్యూటీఐటీసీ) సహకారంతో ఆఫ్రికా ఖండంలోని బోట్స్‌వానాలో టీ కన్సల్టెంట్ సేవలు ప్రారంభమయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిధిలో పనిచేసే వరల్డ్ హెల్త్ అసెంబ్లీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా డాక్టర్ ఎడ్విన్ డికోలోటీ తన స్వదేశం బోట్స్‌వానాలో టీ కన్సల్టెంట్ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డబ్ల్యూటీఐటీసీ చైర్మన్ సందీప్ మక్తాలతో సమావేశమైన బోట్స్‌వానా మంత్రి, ఇతర అధికారులు తెలుగు రాష్ట్రాల్లోని ఐటీ పరిశ్రమతో అనుసంధానం అయ్యేందుకు ఆసక్తి చూపించారు. అనంతరం సందీప్ మక్తాల మాట్లాడుతూ.. ఆఫ్రికా ఖండంలో అనేక సేవలలో నూతన మార్పులకు శ్రీకారం చుట్టే దిశగా టీకన్సల్టెంట్ తన సేవలను అందించనుందని అన్నారు. టీ కన్సల్ట్ ప్రత్యేకంగా ఒక యాప్ రూపొందించనున్నదని, దానివల్ల సేవలు సమగ్రంగా, సౌకర్యవంతంగా అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఆఫ్రికా ఖండంలోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటానికి, టెక్నాలజీ అధారంగా ఉత్తమ జీవనం సాగించేందుకు దోహదపడనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈవీ శ్రీనివాస్, వెంకట్ తోట కూర, చల్లనగారి నరేంద్ర, తిరునహరి వంశీ కృష్ణ, డాక్టర్ నిరుపమ, డాక్టర్ ప్రవీణ్ గెగ్గిలి, రవితేజ, కిశోర్ పుల్లూరి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన సూత్రధారి హైదరాబాదీ

- గ్లోబల్ కిడ్నీ రాకెట్ కీలక విషయాలు వెలుగులోకి
- తెలంగాణ, కర్ణాటకలోని పేదలే టార్గెట్

హైదరాబాద్, మే 26: కేరళలో బయటపడ్డ 'గ్లోబల్ కిడ్నీ రాకెట్'లో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దీని వెనుక ప్రధాన సూత్రధారిగా హైదరాబాద్‌కు చెందిన ఓ వైద్యుడు, మరికొంత మంది ఉన్నారని కేరళ పోలీసుల విచారణలో తేలింది. కేరళతో ముడిపడి ఉన్న అంతర్జాతీయ అవయవ రాకెట్ ఆ రాష్ట్ర పోలీసులు ఇటీవల చేధించారు. ఇరాన్ నుంచి ఇండియాకు బయల్దేరిన సబిత్ నాసిర్ అనే వ్యక్తిని కొచ్చి విమానాశ్రయంలో అక్కడి పోలీసులు అరెస్టు చేసి, కూపీ లాగారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యుడే ఈ రాకెట్‌కు ప్రధాన సూత్రధారిగా నాసిర్ వెల్లడించాడు.

తెలంగాణ, కర్ణాటక పేద యువతే టార్గెట్

కేరళ పోలీసులు చెబుతున్నదాని ప్రకారం, కిడ్నీ రాకెట్‌ను నడుపుతున్న ముఠాలోని వ్యక్తులు కర్ణాటక, తెలంగాణలోని పేద యువతను టార్గెట్ చేసుకున్నారు. కిడ్నీలను అమ్మితే.. రూ.20లక్షలు ముట్టజెబుతామని ముఠాలోని వ్యక్తులు తొలుత వారిని నమ్మిస్తున్నారు. పాస్‌పోర్ట్, వీసాలను ఏర్పాటుచేసి ఇరాన్‌కు పంపుతున్నారు. అక్కడ కిడ్నీ అవయవ మార్పిడి ఆపరేషన్లు చేసి.. రికవరీ అయ్యాక దాతలను ఇండియాకు పంపుతున్నారు. చివరికి రూ.6 లక్షలు చేతిలో పెడుతున్నారని తెలిసింది. కేరళకు చెందిన ఓ కిడ్నీ దాత చనిపోవటంతో, అతడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఈ ముఠా వ్యవహారం బయటపడింది. బెంగళూరు, హైదరాబాద్ నుంచి 40 మందిని ఇరాన్‌కు తీసుకెళ్లినట్టు సబిత్ నాసిర్ పోలీస్ విచారణలో ఒప్పుకున్నాడు.

నన్ను బలవంతంగా తీసుకెళ్లారు

బలవంతంగా తనతో కిడ్నీని అమ్ముకు నేట్టు చేశారని కేరళలోని నిడుంపోయిలికి చెందిన ఓ గిరిజన మహిళ అక్కడి పోలీసుల్ని ఆశ్రయించారు. రూ.9 లక్షలకు తాను కిడ్నీని అమ్ముకున్నానని, ఇందుకు కారణం తన భర్త, ఓ ఏజెంట్ అంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.3లక్షలు కమీషన్ ఇవ్వాలంటూ తనను డిమాండ్ చేస్తున్నారని తెలిపింది. కిడ్నీరాకెట్ ముఠా గత ఏడాదిన్నర కాలంగా తనను, తన కుటుంబంలోని ముగ్గురు పిల్లలపైనా కన్నేసిందని ఆమె ఆరోపించారు.

- భర్త, ఏజెంట్‌పై కన్నూర్ గిరిజన మహిళ ఆరోపణ

రూ.26 కోట్ల నగదు సీజ్

ఆభరణాల కంపెనీలో ఐటీ దాడులు

నాసిక్: మహారాష్ట్రలోని నాసిక్‌లో ఓ ఆభరణాల కంపెనీలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. ఐటీ శాఖ వర్గాలు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం, ఈ కంపెనీ, దాని ప్రమోటర్లు పన్నుల ఎగవేతకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో సోదాలు నిర్వహించారు. లెక్కల్లో చూపని రూ.26 కోట్ల నగదుతో పాటు, పెట్టుబడులకు సంబంధించిన కొన్ని పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ పెట్టుబడులను కూడా లెక్కల్లో చూపలేదు. వీటిని అధికారులు పరిశీలిస్తున్నారు.

కాఫీతో పార్కిన్సన్ దూరం!

న్యూఢిల్లీ, మే 26: కాఫీ ఎంతమాత్రమూ తాగనివారితో పోల్చితే కాఫీ తాగేవారికి 'పార్కిన్సన్' వ్యాధి బారినపడే ముప్పు తక్కువని తాజా అధ్యయనం వెల్లడించింది. కాఫీ గింజల్లో ఉండే కెఫైన్.. పార్కిన్సన్ వ్యాధి బారిన పడకుండా వ్యక్తులపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది పరిశోధకులు వివరించారు. 1,84,024 మంది నుంచి సేకరించిన డాటాను విశ్లేషించి.. పై నిర్ధారణకు వచ్చారు. పార్కిన్సన్ వ్యాధితో బాధపడే రోగి మెదడు పనితీరు మెల్లగా దెబ్బతింటుంది. అసంకల్పితంగా వణకడం, కదలికలు నెమ్మదించటం, కండరాలు బిగుసుకుపోవటం వంటి లక్షణాలు ఉంటాయి. దీనికి చికిత్స లేదు. జన్యుపరంగా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉన్నవాళ్లలో.. ముప్పును తగ్గించటంపై పరిశోధకులు దృష్టిసారించారు.

ఐటీ సెక్షన్ 139(9) ఏమిటి?

డిఫెక్టివ్ రిటర్న్ నోటీసులు వస్తే ఏం చేయాలి

ఆదాయ పన్ను రిటర్ను (ఐటీఆర్)ల్లో తప్పులు జరుగుతూనే ఉంటాయి. అందుకే ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి. కానీ కొందరు సమయం లేకపోవడం వల్లనో, ఇతర పనుల ఒత్తిడి కారణంగానో ఐటీఆర్‌లను పరిశీలించకుండానే దాఖలు చేస్తుంటారు. అలాంటప్పుడు దాన్ని 'డిఫెక్టివ్ రిటర్న్'గా పరిగణిస్తారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 139(9) కింద ఆదాయ పన్ను శాఖ.. సదరు ఐటీఆర్‌ను దాఖలు చేసినవారికి నోటీసులనూ పంపుతుంది.



డిఫెక్టివ్ రిటర్న్ నోటీసు ఎలా వస్తుంది?

మీ ఐటీఆర్‌లో ఐటీ శాఖ అధికారులు తప్పుల్ని గుర్తిస్తే.. దాన్ని డిఫెక్టివ్ రిటర్న్‌గా చూస్తారు. సమాచార లోపం, గణాంకాల పొరబాట్లు, ఇతరత్రా తప్పులున్నందుకు నోటీసులిస్తారు. వీటినే డిఫెక్టివ్ రిటర్న్ నోటీసులంటారు. సంబంధిత మదింపు సంవత్సరానికిగాను మీ పాన్ నంబర్‌నుద్దేశిస్తూ ఈ నోటీసును మీ రిజిస్టర్డ్ ఈ-మెయిల్ ఐడీకి పంపుతారు. ఐటీ శాఖ ఈ-ఫైలింగ్ పోర్టల్‌లోనూ ఇది ఉంటుంది. ఈ నోటీస్.. పాస్‌వర్డ్‌తో ఉంటుంది. మీ పాన్ నంబర్, మీరు పుట్టిన తేదీయే పాస్‌వర్డ్. ఉదాహరణకు మీ పాన్ నంబర్ MNOPQ1212C, మీరు పుట్టిన తేదీ 12/12/1990. అప్పుడు మీ పాస్‌వర్డ్ MNOPQ1212C12121990.

ఈ కారణాలతో..

- అనెగ్జర్స్, స్టేట్‌మెంట్స్, అన్ని వనరుల నుంచి ఆదాయం వంటి తప్పనిసరి కాలమ్‌లను పూరించకపోతే అసెసింగ్ ఆఫీసర్ డిఫెక్టివ్ రిటర్న్ నోటీసులను ఇచ్చేందుకు వీలున్నది.
- ఐటీఆర్‌లో టీడీఎస్, టీసీఎస్, అడ్వాన్స్ ట్యాక్స్ లేదా సెల్ఫ్-అసెస్‌మెంట్ ట్యాక్స్‌లకు సంబంధించి చెల్లించిన పన్నుల వివరాలు లేకపోతే నోటీసులు వస్తాయి.
- టీడీఎస్-ఆదాయం సరిపోల్చలేని విధంగా ఉన్నా, బుక్‌కీపింగ్ సమస్యలున్నా, ఐటీ ఆడిట్‌కు సంబంధించి అభ్యంతరాలున్నా, ఐటీఆర్-పాన్ కార్డుల్లోని పేర్లలో తేడాలున్నా నోటీసులు తప్పవు.

సమయంలోగా స్పందించాలి

డిఫెక్టివ్ రిటర్న్ నోటీసుల వల్ల ఐటీఆర్ దాఖలుదారులు తాము చేసిన తప్పులకు నష్టపోకుండా ఉండేందుకు వీలుంటుంది. అయితే సకాలంలో ఈ నోటీసులకు స్పందించకపోతే మాత్రం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. వాస్తవానికి నోటీసు వచ్చిన 15 రోజుల్లోగా బదులివ్వాలి. ఒకవేళ ఈలోగా పని పూర్తి కాకుంటే కాలవ్యవధిని పొడిగించాలని విజ్ఞప్తి చేసుకోవచ్చు. అప్పటికీ పూర్తికాకపోతే మీరు దాఖలు చేసిన ఐటీఆర్‌ను పరిగణనలోకి తీసుకోరు. ఫలితంగా మీకేమైనా రిఫండ్స్ రావాల్సి ఉంటే ఆగిపోతాయి. అంతేగాక ఆలస్యానికిగాను వడ్డీ, జరిమానాల్నీ ఎదుర్కోవాల్సి రావచ్చు.

వర్చువల్ క్రెడిట్ కార్డులు..

వర్చువల్ క్రెడిట్ కార్డులంటే డిజిటల్ క్రెడిట్ కార్డులు. ఇవి ఆన్‌లైన్‌లో లభిస్తాయి. వీటికి భౌతిక రూపం ఉండదు. అయినప్పటికీ సాధారణ క్రెడిట్, డెబిట్ కార్డులవలే కార్డు నంబర్, సీవీవీ, వ్యాలిడిటీ తేదీలుంటాయి. ఈ వివరాలన్నీ కూడా మీకు ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతం చాలా ప్రధాన క్రెడిట్ కార్డు జారీదారులు ఈ వర్చువల్ క్రెడిట్ కార్డులను అందిస్తున్నారు. అయితే వినియోగదారులు వీటిని ఆన్‌లైన్ లావాదేవీల్లోనే వాడుకోగలరు.

ఫీచర్లు-లాభాలు

వర్చువల్ క్రెడిట్ కార్డులు వన్-టైమ్ యూసేజ్ ఆప్షన్‌తో వస్తాయి. ఒకసారి వచ్చిన కార్డు నంబర్‌తో 24 గంటల నుంచి 48 గంటల వరకు మాత్రమే లావాదేవీలు జరుపగలం. దుర్వినియోగం, దొంగతనం వంటి సమస్యలను వీటి ద్వారా కష్టమర్లు అధిగమించగలరు. ఒకవేళ ఈ కార్డు తమకు అక్కర్లేదనుకుంటే కార్డుహోల్డర్లు క్యాన్సిల్ చేసుకోవచ్చు. లేదా బ్లాక్ చేసుకోవచ్చు.

ఎలా పనిచేస్తుంది?

వర్చువల్ క్రెడిట్ కార్డు అనేది మీ దగ్గరున్న క్రెడిట్ కార్డుకు ఆన్‌లైన్ రూపం. దీనికో యూనిక్ క్రెడిట్ కార్డు నంబర్ ఉంటుంది. మీ ఒరిజినల్ క్రెడిట్ కార్డు వివరాలు తెలుపకుండానే దాని ద్వారా ఆన్‌లైన్ కొనుగోళ్లు చేపట్టవచ్చు. వన్-టైమ్ కోడ్‌తో ఇది పనిచేస్తుంది. తొలుత కార్డు నంబర్‌ను ఇన్‌పుట్ చేయాలి. ఆపై వ్యాలిడిటీని ఎంటర్ చేయాలి. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీతో వెరిఫై చేసుకొని లావాదేవీని పూర్తిచేయవచ్చు.



మనలో చాలామంది పదవీ విరమణ తర్వాత ప్రశాంతమైన జీవితాన్ని గడిపేందుకు.. ముందుగానే రిటైర్మెంట్ ప్రణాళికల్ని వేస్తుంటారు. కానీ ఇందుకు ఏ మార్గాన్ని ఎంచుకోవాలో మాత్రం తెలియక సతమతమవుతుంటారు. అలాంటివారిలో ఎక్కువమంది పీపీఎఫ్, ఈపీఎఫ్, ఎన్‌పీఎస్‌ల్లో దేన్ని ఎంచుకుంటే మెరుగైన రాబడుల్ని పొందవచ్చో తెలియక ఇబ్బంది పడుతూండటం కనిపిస్తుంది. అయితే 2009లో సాధారణ ప్రజానీకానికి సైతం అందుబాటులోకి వచ్చిన పెట్టుబడి సాధనం ఎన్‌పీఎస్ ఆకర్షణీయమని చెప్పకోవచ్చు.

రిటైర్మెంట్‌కు ఏది ఉత్తమం!

నేషనల్ పెన్షన్ స్కీం

ఎన్‌పీఎస్ అనేది ఓ ప్రభుత్వ స్పాన్సర్డ్ పెన్షన్ స్కీం. పదవీ విరమణ తర్వాత ఆదాయాన్ని అందిస్తుంది. ఈక్విటీ, కార్పొరేట్ బాండ్లు, ప్రభుత్వ సెక్యూరిటీలు ఇలా మనం ఎంచుకున్న పెట్టుబడి మార్గాన్నిబట్టి వివిధ స్థాయిల్లో రాబడులు పొందవచ్చు. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ, 80సీసీడీ కింద పన్ను ప్రయోజనాలనూ అందుకోవచ్చు.

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

పీపీఎఫ్ అనేది ప్రభుత్వ దీర్ఘకాలిక పెట్టుబడి పథకం. 15 ఏండ్ల మెచ్యూరిటీ వ్యవధితో, నిర్ధిష్ట రాబడులను అందిస్తుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద పీపీఎఫ్ విరాళాలకు పన్ను మినహాయింపులు వర్తిస్తాయి. ఏటా రూ.1.5 లక్షలదాకా పెట్టుబడులపై పన్ను మినహాయింపుంటుంది. ఇక ఐదేండ్లు పూర్తయితే అవసరముంటే పీపీఎఫ్ ఖాతాల నుంచి కొంత నగదునూ ఉపసంహరించుకోవచ్చు.

ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్

ఈపీఎఫ్ అనేది రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీం. వేతన జీవులకు ఇది ఎంతో పరిచయమున్న పథకం. ఇందులోకి అటు ఉద్యోగి, ఇటు సంస్థ నుంచి నెలనెలా కొంత నగదు మొత్తాలు వెళ్తాయి. వీటిపై స్థిరమైన వడ్డీరేటు ఉంటుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులుంటాయి. ఏటా రూ.2.5 లక్షల వరకు పెట్టుబడులపై పన్ను ప్రోత్సాహకాలు లభిస్తాయి. పీఎఫ్ ఖాతాల నుంచి విద్య, గృహ, వైద్య అవసరాలకు నగదును ఉపసంహరించుకోవచ్చు.

చరిత్ర ఇలా..

ఎన్‌పీఎస్‌తో పోల్చితే పీపీఎఫ్, ఈపీఎఫ్‌లకు ఏండ్ల తరబడి చరిత్ర ఉన్నది. ఎప్పట్నుంచో పీపీఎఫ్, ఈపీఎఫ్‌లు పెట్టుబడి సాధనాలుగా ఉంటున్నాయి. వాటికి సురక్షితమైన పెట్టుబడులు, స్థిరమైన రాబడుల ముద్రపడింది. ఇవి రుణ సాధనాల్లో పెట్టుబడులు పెడుతాయి. అయితే నేటి యువతరంలో ఎన్‌పీఎస్ పెట్టుబడులు ఎంతో ప్రాచుర్యాన్ని పొందుతున్నాయి. కారణం ఇవి స్టాక్ మార్కెట్ రిలేటెడ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌గా ఉన్నాయి. దీంతో రాబడులు అధికంగా, ఆకర్షణీయంగా ఉంటున్నాయి. ఇక కేవలం 25 శాతం ఈక్విటీ కేటాయింపులతో గడిచిన 15 ఏండ్లలో పీపీఎఫ్, ఈపీఎఫ్ కన్నా ఎక్కువ మొత్తంలో ఎన్‌పీఎస్‌లో రాబడుల్ని ఇన్వెస్టర్లు అందుకున్నట్టు గణాంకాలు సైతం చెప్తున్నాయి.

వ్యత్యాసం..

పీపీఎఫ్: నిర్ధిష్ట రిటర్నులుంటాయి. పన్ను ప్రయోజనాలు, స్వల్ప మొత్తాల ఉపసంహరణలకు వీలున్నది. సురక్షిత పెట్టుబడులను కోరుకునేవారికి ఇవి ఉత్తమం.

ఈపీఎఫ్: మీరు ఉద్యోగులైతే మీ జీతాల్లో నుంచే ఆటోమేటిగ్గా నగదు మొత్తాలను తీసుకోవడం జరుగుతుంది. ఇందులో పొదుపునకు గ్యారంటీడ్ రిటర్న్స్, పన్ను ప్రయోజనాలుంటాయి.

ఎన్‌పీఎస్: ఈక్విటీ ఆప్షన్ల వల్ల అధిక రిటర్న్స్‌కు వీలున్నది. మీరు ఎంచుకునే పెట్టుబడులనుబట్టి అదనపు పన్ను ప్రయోజనాలు, ఫ్లెక్సిబులిటీ ఉంటుంది. అయితే మార్కెట్ రిస్క్‌కు లోబడి పెట్టుబడులుంటాయి. రిటైర్మెంట్‌కు ముందు ఉపసంహరణ ఆప్షన్లూ పరిమితంగానే ఉంటాయి. అయినప్పటికీ ఐటీ చట్టంలోని సెక్షన్ 80 సీసీడీ (1బీ) కింద పన్ను చెల్లింపుల్లో అదనంగా రూ.50,000 వరకు క్లెయిం చేసుకునే వెసులుబాటున్నది. ఇది పీపీఎఫ్, ఈపీఎఫ్‌ల్లో లభిస్తున్న రూ.1.5 లక్షలకు అదనం. ఇక ఆటోమేటిక్ రీబ్యాలెన్సింగ్ సదుపాయం కూడా ఉన్నది.

చివరగా..

మార్కెట్ రిస్క్‌లతో ఎన్‌పీఎస్ పెట్టుబడులు ముడిపడి ఉంటాయి. కాబట్టి నిపుణుల సలహాతో ముందుకెళ్తే మరింత ప్రయోజనాలను ఇన్వెస్టర్లు అందుకునే వీలున్నది.



ఇదీ సంగతి..

*మీకు 30 ఏండ్లనుకుందాం. మరో 30 ఏండ్లకు రిటైర్మెంట్ వయసు వస్తుంది. ఈ సమయంలో మీ పదవీ విరమణ నిధి కోసం పీపీఎఫ్, ఈపీఎఫ్ కంటే ఎన్‌పీఎస్ ఉత్తమమైనదని చెప్పవచ్చు. స్టాక్ మార్కెట్లలో స్వల్పకాలిక పెట్టుబడుల కన్నా, దీర్